క్లుప్తంగా

గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సమావేశం



గ్రంథాలయంలో చర్చిస్తున్న గ్రంథాలయ అభివృద్ధి కమిటీ

పాయకరావుపేట : స్థానిక శాఖా గ్రంథాలయంలో 56 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహణ నిమిత్తం గ్రంథాలయ అభివృద్ధి కమిటీతో బుధవారం ఉదయం గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణరావు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఏఏ పోటీలు నిర్వహించాలి...అనే అంశాలపై కమిటీ చర్చించడం జరిగింది. ఈ సమావేశంలో ఆర్.వి. రత్నం మాస్టర్ రిటైర్డ్ లెక్చరర్ సీతారామయ్య, రిటైర్డ్ ఉద్యోగి సీతారామమూర్తి, యోగా మాస్టర్ ప్రసాద్, రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి అచ్చుతరావు, తెలుగు పండితులు వరలక్ష్మి, రామకృష్ణ, రిటైర్డ్ లైబ్రేరియన్ మూర్తి పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు



వలంటీర్ పోస్టుకు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న ఎంపీడీవో మన్మథరావు

మునగపాక : స్థానిక మండల పరిషత్ హాలులో బుధవారం మండలంలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 14 పోస్టులకు 24 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 3వ తేదీన ఎంపికైన వలంటీర్లకు నియామక పత్రాలను అందజేశారు. ఎంపీడీవో పి.మన్మథరావు, ఈవోఆర్డీ పి.వెంకటలక్ష్మి కార్యక్రమంలో పాల్గొన్నారు.

దేవాలయాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు



సమరసత సేవా ఫౌండేషన్ సంఘం సమావేశం

పాయకరావుపేట : దేవాలయాల్లో ప్రతి నిత్యం ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా సంయోజక్ మాలకొండయ్య అన్నారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలో గల పెద రాంభద్రపురం గ్రామంలో సేవా ఫౌండేషన్ మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ దేవాలయాల్లో వారం వారం భజన కార్యక్రమాలు, రెండో శనివారం సత్సంగాలు, ఏకాదశి నాడు నగర సంకీర్తన, ప్రతి పౌర్ణమికి సామూహిక హారతి కార్యక్రమాలు కార్యక్రమాలు జరిపించాలన్నారు. ఈ సమావేశంలో మండల సంయోజక్‌లు నీలాపు వెంకటరెడ్డి, తాడి సూర్యమూర్తి, సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ కట్టా వీరబాబు పాల్గొన్నారు.

తెలుగు భాష పూర్వ వైభవానికి కృషి



తెలుగు భాష ప్రాముఖ్యతను వివరిస్తున్న రామ్మోహన్‌రావు

తుమ్మపాల: రోజురోజుకూ నిరాదరణకు గురవుతున్న తెలుగు భాష పరిరక్షణకు అందరూ చేయూతనివ్వాలని తెలుగు భాష పరిరక్షణ సమితి సమన్వయకర్త కె.రామ్మోహన్‌రావు కోరారు. పట్టణంలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన 'తెలుగుకు వెలుగునిద్దాం'39వ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి రోజుకు కనీసం అరగంట సమయం తెలుగు పుస్తకాలు చదివేందుకు కేటాయించాలని అందుకు తల్లిదండ్రులు కూడా తమ వంతు సహకారం అందించాలని కోరారు. తెలుగు భాషకు పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. పద్యకవి శిష్టా తమ్మిరాజు మాట్లాడుతూ పద్యం తెలుగువాడి ఆస్తి అని పేర్కొంటూ, తెలుగు పద్యం ప్రాముఖ్యతను వివరించారు. ప్రముఖ కవి, రచయిత మాధవి సనారా మాట్లాడుతూ చిన్న చిన్న పదాలతో కవితలు రాయవచ్చని, అవి తెలుగు భాష మాధుర్యాన్ని తెలియజేస్తాయన్నారు. విద్యార్థులకు తెలుగు కవితలు రాయడంపై అవగాహన కల్పించారు. బాల్యంలోనే తెలుగుకు పటిష్ట పునాది వేయాలని, దీనికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కృషి చాలా అవసరమని ప్రముఖ రచయిత్రి అమరజ్యోతి అన్నారు.

ఘనంగా రాష్ట్రావతరణ దినోత్సవం

అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళులు



ఎంపీడీవో కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



నక్కపల్లి పంచాయతీ వద్ద అమరజీవికి నివాళులర్పిస్తున్న వీసం రామకృష్ణ తదితరులు



మండల పరిషత్ కార్యాలయం వద్ద శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ బోదెపు గోవింద్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు

నక్కపల్లి : ఆంధ్ర రాష్ట్ర అవతరణ వేడుకలు బుధవారం నక్కపల్లిలో ఘనంగా జరిగాయి. పంచాయతీ కార్యాలయం వద్ద ఏపి పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం తదితరులు అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల పరిషత్ వద్ద వైస్ ఎంపీపీ వీసం నానాజీ, పెద బోదిగల్లం పాఠశాలలో హెచ్‌ఎం సత్యనారాయణలు శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం తన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన త్యాగధనుడు పొట్టి శ్రీరాములని కొనియాడారు. మహాత్మాగాంధీ బోధించిన సత్యం, శాంతి, అహింస అనే ఆయుధాలతో ఉద్యమాల్లో పాల్గొనేవారన్నారు. ఆంధ్ర రాష్ట్ర సాధనలో ఆయన కృషి అనిర్వచనీయమన్నారు. క్విట్ ఇండియా ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం తదితర జాతీయ ఉద్యమాల్లో సైతం గాంధీజీకి తోడుగా ఉండేవారన్నారు. ఆయన ఆత్మ బలిదానంతో ఆంధ్రుల చిరకాల వాంఛ అయిన ఆంధ్ర రాష్ట్రం అవతరించిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నేతల రత్నకుమారి, ఎంపీడీవో శ్రీనివాసరావు, పరిపాలనాధికారి సీతారామరాజు, ఈవోపిఆర్డీ సత్యనారాయణ, కార్యదర్శి రాజశేఖర్, ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్ ఆచార్యులు, ఫల్గుణరావు, ఎ.వి.ఎల్.కుమారి, మండల పరిషత్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యలమంచిలి : ఆంధ్ర రాష్ట్రం ఆవతరణ కోసం ఆహర్నిశలు శ్రమించిన వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు అని ఆయన సేవలు చిరస్మరణీయమని ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. యలమంచిలి పట్టణంలో బుధవారం ఆంధ్రరాష్ట్ర ఆవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. దిమిలి రోడ్డులో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఎంపీపీ బోదెపు గోవింద్ ఆర్య వైశ్య సంఘం సభ్యులు ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె.అప్పలనాయుడు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి ప్రజాప్రతినిధులు అధికారులు అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గోవింద్ మాట్లాడుతూ తెలుగు ప్రజలకు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం దీక్ష పూని ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములుకు ప్రతి ఒక్కరు ఎంతో రుణపడి ఉన్నామని, ఆయన చేసిన త్యాగఫలమే ప్రస్తుత తెలుగు ప్రజలు గర్వించతగిన రాష్ట్రం అని కొనియాడారు.

ఆరోగ్య సురక్షలో అన్ని వ్యాధులకు పరీక్షలు



వైద్య శిబిరానికి హాజరైన రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం : జగనన్న ఆరోగ్య సురక్షలో అన్ని రకాల వ్యాధులకు పూర్తి స్థాయిలో వైద్య పరీక్షలు చేయించుకోవచ్చని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మండలంలో చివరిగా చినగుమ్ములూరు గ్రామంలో బుధవారం ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 362 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 8 మందిని ఆరోగ్య శ్రీ వైద్య సేవలు అందించేందుకు పట్టణ ఆసుపత్రులకు తరలిస్తున్నట్టు పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి నాయక్ చెప్పారు. ఇటీవల కంటి శస్త్ర చికిత్స చేయించుకున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావును కంటి వైద్య నిపుణులు వి.అనూష తనిఖీ చేశారు. శిబిరంలో ఎముకల వైద్య నిపుణులు వంశీకృష్ణ పరీక్షలు నిర్వహించారు. సాధరణ వైద్య పరీక్షలు షాభణం, కిరణ్‌ప్రసాద్‌లు నిర్వహించారు.

తాగునీరు, పారిశుధ్య సమస్యలపై ప్రత్యేక దృష్టి

19వ వార్డులో చైర్‌పర్సన్ ఇంటింటి పర్యటన



19వ వార్డులో పర్యటిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, అధికారులు

యలమంచిలి(అనకాపల్లి రూరల్): వార్డుల్లో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పురపాలక సంఘంలో వార్డు విజిట్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి చెప్పారు. ప్రజల ఇబ్బందులను స్వయంగా చూసి తెలుసుకుని చిన్న చిన్న సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించడానికి అధికార యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. బుధవారం వేకువజామున 5 గంటలకే చైర్‌పర్సన్ రమాకుమారి, మున్సిపల్ కమిషనర్ కె.ఎ.కొండలరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, ఆ ప్రాంతానికి చెందిన ముగ్గురు వార్డు కౌన్సిలర్లు 19వ వార్డు ఎర్రవరం శివారు సింగవరంలో పర్యటించారు. వీధుల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సింగవరంలో కొన్ని ప్రాంతాలకు తాగునీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని, రోడ్లపై చెత్త కనిపిస్తోందని స్థానికులు కొందరు చైర్‌పర్సన్, అధికారుల దృష్టికి తెచ్చారు. వెంటనే ఆ గ్రామంలో ఇంటింటి చెత్త సేకరణ, మురుగునీటి వ్యవస్థ పరిస్థితిపై అధికారులతో రమాకుమారి చర్చించారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఇక్కడ గ్రామంలో అంతర్గత రహదారులు ఇరుకుగా ఉండడంతో పారిశుధ్యం మెరుగుపర్చేందుకు ఎదురవుతున్న సమస్యలను పారిశుధ్య కార్మికులు చైర్‌పర్సన్‌కు తెలిపారు. తాగునీటి సరఫరా అన్ని ప్రాంతాలకు సక్రమంగా జరిగేలా మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చర్చించి తీర్మానం చేస్తామని రమాకుమారి చెప్పారు. ఇటీవల పట్టణంలోని కొత్తపేటలో వార్డ్ విజిట్ కార్యక్రమాన్ని ప్రారంభించామని అక్కడ చిన్న చిన్న సమస్యల్ని పరిష్కరించాక మరో వార్డులో పర్యటిస్తున్నట్టు అధికారులు తెలిపారు. అందుకే ఒక వార్డును పర్యటించిన తర్వాత మూడు నుంచి నాలుగు రోజుల విరామం తర్వాతనే మరో వార్డును ఎంపిక చేస్తున్నామని వారు చెప్పారు. కార్యక్రమంలో డీఈఈ వీరయ్య, ఏఈ గణపతి సుబ్బారావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గోవింద్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు దూది నర్సింహమూర్తి, ప్రగడ రమణ, వార్డు కౌన్సిలర్ పిట్టా సత్తిబాబు, పట్టణ ప్రణాళిక అధికారిణి వై శ్రీలక్ష్మి, పాలసంఘం అధ్యక్షుడు సియ్యాద్రి బాబు, ములంపాక నానాజీ, శానిటరీ అసిస్టెంట్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోస్టర్ ఆవిష్కరణ



విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

యలమంచిలి : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నవంబర్ 8న రాష్ట్ర వ్యాప్తంగా పిలుపునివ్వడం జరిగిందని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.శివాజీ అన్నారు. బుధవారం యలమంచిలిలో విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ పోస్టర్‌ను డీవైఎఫ్ఐ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాంట్‌లో ఖాళీలు భర్తీ చేయకపోగా ఉన్న ప్రభుత్వ సంస్థను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి అప్పజెప్పడం అన్యాయమని అన్నారు. విద్యార్థి యువజన సంఘాలన్ని ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ బంద్‌ను పిలుపునివ్వడమైందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.రమణ, జిల్లా ప్రెసిడెంట్ మామిడి రమణ, పీడీఎస్‌వో నాయకులు భాస్కర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సభ్యుడు బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నేతలు

నక్కపల్లి : తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ నాయకుడు ఎం.అప్పలరాజు కోరారు. బుధవారం ఆయన పలు గ్రామాల్లో పర్యటించారు. వర్షాలు లేకపోవడంతో నాట్లుకు నోచుకోని పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో నక్కపల్లిలో తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. అయితే ప్రభుత్వం ప్రకటించిన మండలాల్లో నక్కపల్లి లేకపోవడం బాధాకరమన్నారు. 5వేల ఎకరాలకు గాను కేవలం 1200 ఎకరాల్లో మాత్రమే వరి నాట్లు వేశారన్నారు. వర్షాలు లేకపోవడంతో అవి కూడా ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. తక్షణమే ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని కోరారు. వెంటనే ఉపాధి పనులు ప్రారంభించాలన్నారు.

సీపీఎం నేతల ఆందోళన

మునగపాక : వర్షాభావ పరిస్థితుల్లో మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని సీపీఎం నేత ఎస్.బ్రహ్మాజీ కోరారు. కొద్ది రోజులుగా వర్షాలు కురవకపోవడంతో పలు ప్రాంతాల్లో ఎండిపోయిన వరిపైర్లను బుధవారం సీపీఎం నేతలు పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బ్రహ్మాజీ మాట్లాడుతూ పంట ఎండిపోయి నష్టపోయిన వరి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఈ మేరకు తహసీల్దార్ వినయ్‌కుమార్‌కు వినతి అందజేశారు. కార్యక్రమంలో రైతులు దాడి వీరునాయుడు, సూరప్పారావు, ముసిలినాయుడు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అధికారులతో వై.లోవ గ్రామస్తుల చర్చలు



అధికారులతో సమావేశమై చర్చలు జరుపుతున్న వై.లోవ గ్రామస్తులు

రాంబిల్లి: వై.లోవ గ్రామస్తులు బుధవారం అధికారులతో సమావేశమయ్యారు. నేవీ స్థలంలో ప్రహరీ నిర్మాణ పనులను గ్రామస్తులు అడ్డుకున్న విషయం తెలిసిందే. సోషల్ ఫారెస్ట్‌కు చెందిన కొండ ప్రాంతాన్ని నేవీకి అప్పగించడంతో ఈ కొండ చుట్టూ ప్రహరీ నిర్మిస్తుండడంతో పనులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ పి. భాగ్యవతి, ఎస్ఐ దీనబంధు ఈ గ్రామానికి వెళ్లారు. పనులకు సహకరించాలని గ్రామస్తులను అధికారులు కోరారు. అయితే ఈ కొండ ప్రాంతంలో ఉపాధి పనులు చేసుకునేవారమని తమ ఉపాధికి ముప్పు ఏర్పడుతుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. తమకు ఉపాధి చూపాలన్నారు. అలాగే సోషల్ ఫారెస్ట్ స్థలాల్లో వున్న ఇళ్లు, రహదారిని విడిచి పెట్టి ప్రహరీ నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బద్ది నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంపునకు విద్యార్థిని ఎంపిక



హేమలత

పాయకరావుపేట: ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంపునకు స్పేసెస్ డిగ్రీ కళాశాలలో బి.బి.ఎ. తృతీయ సంవత్సరం విద్యార్థిని పైలా హేమలత ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వీర్రాజు తెలిపారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ఐదుగురు ఎంపిక కాగా అందులో తమ కళాశాల నుంచి ఒకరు ఉండడం గర్వకారణమన్నారు. ఈ విద్యార్థిని నవంబర్ 1 నుంచి 10వ తేదీ వరకు విజయవాడ కె.ఎల్. యూనివర్సిటీలో జరిగే శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటుందని తెలిపారు. ఆ విద్యార్థినిని విద్యా సంస్థల అధినేత నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్ అభినందించారు.

బీకే పల్లిలో జెడ్పీటీసీ నిధులతో తాగునీటి బోరు



బి.కె.పల్లిలో చేతిబోరు వేస్తున్న దృశ్యం

కోటవురట్ల : గ్రామంలో మంచినీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీటీసీ పెట్ల రాంబాబు తెలిపారు. బి.కె.పల్లిలోని దుంగల అప్పలనాయుడు మకాం వద్ద జెడ్పీటీసీ నిధులతో బుధవారం చేతిబోరు వేశారు.

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, ఎంపీటీసీ పెట్ల రాంబాబు, మాజీ ఉప సర్పంచ్ పెట్ల వెంకటరమణ చేతిబోరుకు భూమిపూజ చేశారు. ఎంపీటీసీ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి జరుగుతోందన్నారు. విద్య, వైద్యానికి ప్రాధాన్యం ఇస్తూ మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. చేతిబోరుకు జెడ్పీటీసీ నిధులు ఇచ్చినందుకు జెడ్పీటీసీ ఉమాదేవికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు మరిడిమాంబ జాతర



అనకాపల్లి రూరల్: మండలంలోని పిసినికాడ గ్రామంలో గురువారం గ్రామ దేవత మరిడిమాంబ అమ్మవారి జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏటా విజయదశమి తరువాత వచ్చే రెండో గురువారం ఈ గ్రామంలో మరిడిమాంబ అమ్మవారికి జాతర జరపడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా గ్రామ పొలిమేరలో ఉన్న అమ్మవారి ఆలయం నుంచి గ్రామ ముఖ ద్వారం వరకు భారీగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. జాతరను పురస్కరించుకుని గ్రామానికి పెద్ద సంఖ్యలో బంధు, మిత్రులు చేరుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది. అమ్మవారి దర్శనానికి పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు పూర్తి చేశారు. భక్తులకు తాగునీరు, మజ్జిగ ఉచితంగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

24న కళల ప్రదర్శన పోటీలు



మాట్లాడుతున్న సత్యనారాయణ

రాంబిల్లి : సంస్కృతి, సంప్రదాయాకు ప్రతీకలైన కళల ప్రదర్శన పోటీలను ఈ నెల 24న నిర్వహిస్తున్నట్టు సమరసత ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ ఎన్. సత్యనారాయణ అన్నారు. రాంబిల్లిలో బుధవారం సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ పోటీలపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు అప్పారావు, నూకరాజు, గగన్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీకమాస ఉత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ



కార్తీకమాసోత్సవాల గోడపత్రికను ఆవిష్కరిస్తున్న మంత్రి అమర్‌నాథ్, ఎంపీ బీవీ సత్యవతి

అనకాపల్లిటౌన్: స్థానిక సుంకర మెట్ట జంక్షన్ సత్యనారాయణ, సూర్యనారాయణస్వామి ఆలయంలో కార్తీకమాస ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్టు మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ బీవీ సత్యవతిలు చెప్పారు. పట్టణంలోని ఎన్టీఆర్ క్రీడామైదానంలో బుధవారం కార్తీకమాసోత్సవాల గోడపత్రికను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల రోజులపాటు శివార్చనలు, అభిషేకాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, ఆలయ చైర్మన్ కె.ఎం.నాయుడు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

జాతీయ బాలల ఉత్సవానికి జెనిత్



కశింకోట: జాతీయ బాలల ఉత్సవానికి అనకాపల్లికి చెందిన బాల నృత్య కళాకారుడు జెనిత్ సంఘవి ఎంపికయ్యాడు. ఈ నెల 17 నుంచి న్యూఢిల్లీలో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి సంస్థ నిర్వహిస్తున్న ఉత్సవానికి రాష్ట్ర బృందం తరపున హాజరుకానున్నారు. విశాఖలోని కొరియోగ్రాఫర్ నాగరాజు పట్నాయక్ వద్ద శిక్షణ పొందుతున్నాడు. అతి చిన్న వయస్సులోనే 8 రాష్ట్రాలకు చెందిన జానపద నృత్యాలను జెనిత్ అవలీలగా ప్రదర్శిస్తాడు.

రైలు పట్టాల పక్కన మహిళ మృతదేహం



రైల్వేగేటు సమీపాన పడివున్న మహిళ మృతదేహం

పాయకరావుపేట: పట్టణంలోని నాగరాజుపేట రైల్వే గేటు సమీపాన రైలు పట్టాల పక్కన గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని బుధవారం గుర్తించినట్లు తుని ఎస్ఐ షేక్ అబ్దుల్ మారుఫ్ తెలిపారు. మృతురాలు తెలుపు, పసుపు రంగుల టాప్, నలుపు రంగు లెగ్గిన్ ధరించి ఉందన్నారు. సుమారు 35 ఏళ్ల వయసుంటుందని పేర్కొన్నారు. మృతురాలి వద్ద ఏ విధమైన ఆధారాలు లేవన్నారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరచినట్లు తెలిపారు. మృతురాలు వయస్సు 35 సంవత్సరాలు వుంటుందని ఎస్ఐ తెలిపారు.